క్లుప్తంగా

చదవడం, రాయడంపై పట్టు సాధించాలి



ప్రత్తిపాడు: విద్యార్థులు చదవడం, రాయడం పట్ల పట్టు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవో–2 జి. లీలారాణి అన్నారు. మండల పరిధిలోని పాతమల్లాయ పాలెం హెచ్ఈ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎంఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల రిజిస్టర్లు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. అనంతరం విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల పాఠాలను వారితో చదివించి, పఠన నైపుణ్యాలను అంచనా వేశారు. ఎంఈవో మాట్లాడుతూ పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో రాజీ పడవద్దన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యేలా టీఎల్ఎం ఆధారంగా బోధించాలని సూచించారు. హెచ్ఎం నారాయణ తదితరులున్నారు.

కాకుమాను ఎస్ఐగా ఏకనాథ్



కాకుమాను: కాకుమాను ఎస్ఐగా పృథ్వీ ఏకనాథ్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. పట్టాభిపురం ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేసిన రవీంద్ర తుళ్లూరు ట్రాఫిక్ ఎస్ఐగా బదిలీపై వెళ్లారు. మండలంలో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి పెట్టి గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా తగిన చర్యలు తీసుకుంటానని ఎస్ఐ చెప్పారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

పాండ్రపాడు(కాకుమాను): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రతి రోజు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని ఎంఈవో కె.ఎఫ్.కెనడీ అన్నారు. పాండ్రపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని మంగళవారం ఎంఈవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం తప్పనిసరిగా భోజనాన్ని అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎం.నాగమల్లీశ్వరి, ఉపాధ్యాయులు ఉన్నారు.

డయల్ 100 ఫోన్ కాల్స్‌కు వెంటనే స్పందించాలి



నగరంపాలెం: డయల్ 100కు వచ్చే ఫోన్ కాల్స్‌కు సత్వరమే స్పందించి, పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయ(డీపీఓ) ఆవరణలోని హాల్‌లో మంగళవారం పోలీస్ కంట్రోల్ రూం, క్లూస్ బృందం, ఫింగర్ ప్రింట్స్, హైవే పెట్రోలింగ్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ డయల్ 100కు వచ్చే కాల్స్‌కు స్పందించినట్లైతే బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందని అన్నారు. ఏమాత్రం అలసత్వం వహించిన నేరం జరిగేందుకు అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ప్రతి ఫోన్ కాల్‌కు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని అన్నారు. మహిళల భద్రత, రక్షణకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. వారి నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని అన్నారు. జిల్లాలోని ప్రజలు శుభ, ఇతరత్రా కార్యక్రమాలకు వెళ్లే ముందు తప్పనిసరిగా జిల్లా పోలీస్ కంట్రోల్ రూం 8688831568 నంబర్‌కు తెలియజేయాలని అన్నారు. తిరుగు ప్రయాణమై ఇళ్లకు వచ్చే వరకు లాక్డ్ హౌసింగ్ మోనిటరింగ్ సిస్టం (ఎల్ఎంహెచ్ఎస్)ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. తద్వారా ఇళ్లకు భద్రతగా ఉంటుందని అన్నారు.

కమిటీ కుర్రోళ్లు సందడి



నగరంపాలెం: గుంటూరు నగరంలో కమిటీ కుర్రోళ్లు చిత్ర బృందం సందడి చేసింది. మంగళవారం నగరంపాలెం జీటీరోడ్డులోని ఫినిక్స్ మాల్ థియేటర్‌లో మ్యాట్నీ షోకు వచ్చారు. చిత్ర బృందానికి థియేటర్, ఫుడ్ కోర్ట్ యాజమాన్యం స్వాగతం పలికారు. తొలుత కమిటీ కుర్రోళ్లుకు సంబంధించి కేక్‌ను కట్ చేశారు. అనంతరం చిత్ర నిర్మాత, నటి కొణిదెల నీహారిక మీడియాతో మాట్లాడుతూ మంచి చిత్రంగా ప్రేక్షకులు ఆదరించారని అన్నారు. ఫుడ్ కోర్ట్ యాజమాన్యం దాసరి శ్రీకాంత్, సతీష్, శ్రావణ్, వెంకటేష్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

తాడికొండ: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన తుళ్లూరులో చోటు చేసుకుంది. పోలీసుల వివరాలు.. తుళ్లూరు ఎస్సీ కాలనీకి చెందిన బండారు ఏసురత్నం (37) భార్యతో మనస్పర్థలు ఏర్పడటంతో సోమవారం గ్రామ శివారు నీటి గుంతలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం మృతదేహం బయట పడింది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.

అక్రమ దందాలకు కేరాఫ్ పొన్నూరు



సెబ్ అధికారులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు(ఫైల్)



పొన్నూరు సెబ్ కార్యాలయం

- మద్యం పట్టుకునేది తక్కువ.. వదిలేసేది ఎక్కువ
- ఇసుక అక్రమ రవాణా.. జోరుగా మట్కా దందా
- కట్టడిలో అధికారులు విఫలం

పొన్నూరు: పొన్నూరు అక్రమ దందాలకు నిలయంగా మారింది. ధరల పెరుగుదల నేపథ్యంలో జోరుగా ఇసుక అక్రమ రవాణా, గుట్టుగా గంజాయి విక్రయాలు జరుగుతున్నాయి. మట్కా జూదం, అక్రమ మద్యం, బెల్టు దుకాణాల కట్టడి విషయంలో ఏమాత్రం మార్పు కనిపించడం లేదు. ధరల వ్యత్యాసం నేపథ్యంలో రోజురోజుకు ఇతర ప్రాంతాలకు చెందిన అక్రమ మద్యం రవాణా పెరుగుతుందే తప్ప అదుపులోకి రావడం లేదు. నిత్యం మద్యం బెల్టు షాపులకు తరలివెళుతోంది. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో నామమాత్రపు తనిఖీ, దాడులు చేస్తూ కాలం వెళ్లదీస్తోంది. సమర్థంగా పని చేయలేకపోతుందనే ఆరోపణలున్నాయి. మద్యం దుకాణాల నుంచి పరిమితికి మించి కొనుగోళ్లు చేస్తున్నారు. గొలుసు దుకాణాలకు తరలిస్తున్న మద్యాన్ని కట్టడి చేయడంలో సెబ్ చర్యలు కనిపించడంలేదనే విమర్శలు వస్తున్నాయి. మండల కేంద్రం మొదలుకొని మారుమూల ప్రాంతాల వరకు యథేచ్ఛగా గంజాయి రవాణా, మట్కా జూదం, ఇసుక అక్రమ రవాణా సాగుతూ మద్యం అక్రమ రవాణా జరుగుతుండటం ఇందుకు నిదర్శనం.

జోరుగా మట్కా జూదం

కాకుమాను, పెదనందిపాడు మండలాలతో పాటు పొన్నూరు కేంద్రంగా పనిచేస్తున్న స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్)కు సిబ్బంది కొరత వెంటాడుతోంది. క్షేత్ర స్థాయిలో పనిచేసే కానిస్టేబుళ్ల కొరత తీవ్రంగా ఉంది. 11 మంది కానిస్టేబుళ్లకుగాను నలుగురు మాత్రమే ఉన్నారు. వారిలో ముగ్గురు పోలీసులు, ఒక మహిళా పోలీసు, ఎస్సై, సీఐ మాత్రమే ఉండటంతో ఈ పరిస్థితి నెలకొంది. సిబ్బంది కొరత అధికంగా ఉండటంతో ఉన్న కొంత మంది కార్యాలయానికే పరిమితమవుతున్నారనే విమర్శలున్నాయి. దీంతో మద్యం షాపుల నుంచి పరిమితికి మించి మద్యం సీసాలు తరలివెళుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ప్రస్తుతం ఇసుక కొరత తీవ్రంగా ఉండటంతో టన్ను రూ.1,200కు అక్రమ మార్గంలో లభిస్తోంది. గ్రామీణ ప్రాంతాల నుంచి అక్రమంగా నిల్వ చేసిన కేంద్రాల నుంచి ఇసుక అక్రమంగా పట్టణంలోకి వచ్చినా అరికట్టేవారు లేరు. పట్టణ కేంద్రంగా మట్కా జూదం, గంజా అక్రమ రవాణా జరుగుతున్నా కట్టడి చేయడంలో విఫలమవుతున్నారు. పొన్నూరు కేంద్రంగా కొనసాగుతోన్న అక్రమ దందాలపై దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

సిబ్బంది కొరత ఉంది

గంజాయి, అక్రమ మద్యం కట్టడికి తగిన చర్యలు చేపడుతున్నాం. సిబ్బంది కొరత ఉంది. ఉన్న నలుగురిలో ఒకరు సెంట్రీ డ్యూటీ, కోర్టు డ్యూటీకి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఉన్న కొంతమందితోనే అన్ని బాధ్యతలు నిర్వహిస్తున్నాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.

– సుకన్య, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, సెబ్, పొన్నూరు

అమానవీయ ఘటనపై నిరసన ర్యాలీ

పొన్నూరు: కొల్‌కత్తాలో వైద్యురాలి హత్యాచార ఘటన సభ్య సమాజం తలదించుకునేలా ఉందని డాక్టర్ రూత్‌రాణి అన్నారు. మంగళవారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు వైద్యురాలి హత్యాచార కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పొన్నూరులో ప్రైవేటు వైద్యశాలల వైద్యులు, సిబ్బంది నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి తగిన న్యాయం చేయాలని, మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో డీటీ ఆనందరావుకు వినతిపత్రం అందజేశారు.



పట్టణంలో ర్యాలీ నిర్వహించిన వైద్యులు, సిబ్బంది

ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు డాక్టర్ సజ్జా రవీంద్రబాబు, కార్యదర్శి డాక్టర్ ఎస్వీ రమణారావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమస్యలపై వినతి



ఎమ్మెల్సీ అశోక్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న అధ్యక్ష, కార్యదర్శులు

ప్రత్తిపాడు: అంగన్‌వాడీ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఫోరం ఫర్ అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్– మినీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు టి.జ్యోతిరాణి, ఐ.వేమేశ్వరి ఎమ్మెల్సీ అశోక్‌బాబును కలిసి వినతి పత్రం అందజేశారు. మంగళగిరిలో ఆయనకు ఫోరం సభ్యులు తమ సమస్యలను వివరించారు. మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించేందుకు జీవో జారీ చేసే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని అశోక్‌బాబును కోరినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని చెప్పినట్లు జ్యోతిరాణి తెలిపారు.

కలుపు మొక్కల నివారణపై అవగాహన సదస్సు

గుంటూరు రూరల్: సమస్యాత్మకమైన కలుపు మొక్క వయ్యారిభామ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఎన్‌వీవీఎస్ దుర్గా ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం నగర శివారులోని లాంఫాం నందు నిర్వహించిన పార్థీనియా (వయ్యారి భామ) కలుపు మొక్కల నివారణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఈ కలుపు మొక్క ఎక్కడ కనిపించినా వెంటనే పీకి వేయాలని సూచించారు. ఈ మొక్కవల్ల పంటలకు నష్టం కలగడమే కాకుండా జీవరాశులకు శ్వాసకోశ వ్యాధులు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలుపు విభాగం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ప్రతిభ, శాస్త్రవేత్తలు ఉన్నారు.



అవగాహన సదస్సులో లాం ఫాం శాస్త్రవేత్తలు

23న ఉపాధి హామీ పథకం గ్రామ సభలు

తాడికొండ: గ్రామాల్లో ఉపాధి హామీ పనులపై చర్చించి ప్రతిపాదించేందుకు ఈ నెల 23న గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అత్తోట దీప్తి మంగళవారం విడుదల చేశారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న ఈ గ్రామసభకు తాడికొండకు నోడల్ ఆఫీసర్లుగా ఎంపీడీఓ అత్తోట దీప్తి, నిడుముక్కలకు తహసీల్దార్ నాసరయ్య, లాం గ్రామానికి ఈఓపీఆర్డీ సిహెచ్.వెంకటేశ్వర్లు, పొన్నెకల్లు గృహ నిర్మాణ శాఖ ఏఈ ఐ.ఓబుల్ రెడ్డి, మోతడకకు పీఆర్ ఏఈఈ వై.శ్రీనివాస కుమార్, బేజాత్పురం విద్యుత్ ఏఈఈ వెంకట రవికుమార్, గరికపాడు వెలుగు సీసీ రాఘవ, రావెలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వై.శ్రీలత, పాములపాడుకు వెలుగు ఏపీఎం ఆర్.సాంబశివరావు, లచ్చన్నగుడిపూడికి సీహెచ్ నాగ శ్రీనివాస్, ఫణిదరంకు ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఎం.శ్రీదేవి, ముక్కామలకు ఐసీడీఎస్ సూపర్ వైజర్ సీ.హెచ్.కళావతి, కంతేరుకు ఏఎస్ఓ శ్రీధర్, బండారుపల్లికి ఎంఈఓ టి.ఇందిర, దామరపల్లికి ఎంఈఓ–2 డి.ప్రభాకర్‌రావును నియమించారు.

రేపు 'చిరు జల్లులు- సినీ సంగీత విభావరి'

నగరంపాలెం: పద్మవిభూషణ్ మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకల్లో భాగంగా 'చిరు జల్లులు – సినీ సంగీత విభావరి' గురువారం నిర్వహించనున్నట్లు ఆర్ఎస్ ఈవెంట్స్ వ్యవస్థాపకురాలు మునిపల్లె రమణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్నర్‌రింగ్‌రోడ్‌లోని శిల్పారామంలో సాయంత్రం విభావరి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

జీజీహెచ్‌లో ఇక మోకీలు ఆపరేషన్లు

- ఉన్నతీ ఫౌండేషన్ సాయంతో ఉచితం
- గతంలో వంద మందికి చికిత్స
- తొలగిపోనున్న మోకీలు బాధితుల కష్టాలు



జీజీహెచ్‌లో ఉచితంగా ఆపరేషన్ చేయించుకున్న రోగులతో డాక్టర్ నరేంద్రరెడ్డి, డాక్టర్ ప్రశాంత్

గుంటూరు మెడికల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పేదల పెద్ద ఆస్పత్రిగా పేరుగడించిన గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రి(జీజీహెచ్)లో మోకీలు మార్పిడి ఆపరేషన్లు ఉచితంగా చేసేందుకు రంగం సిద్ధమైంది. సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, ఉన్నతీ ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి ముందుకొచ్చారు. గతంలో వంద ఆపరేషన్లు జీజీహెచ్‌లో చేశారు. కరోనా నేపథ్యంలో ఆగిపోయిన ఆపరేషన్లు మళ్లీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ చొరవతో ప్రారంభం కానున్నాయి. ఇటీవల జీజీహెచ్‌లో సమీక్ష చేసిన కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌లకు ఉచిత మోకీలు మార్పిడి ఆపరేషన్‌ల గురించి డాక్టర్ కిరణ్‌కుమార్ వివరించారు. వారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆపరేషన్లు త్వరితగతిన ప్రారంభించి పేదలకు మోకీలు సమస్యలు తొలగించేలా ముగ్గురు వైద్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు.

2007 నుంచి ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు

బీఎంఆర్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, ఉన్నతీ ఫౌండేషన్‌ను 2007లో డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి ప్రారంభించారు. గుంటూరును జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీలకు రాజధానిగా చేయటమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. గతంలో 20 ఆపరేషన్‌లకు ఉన్నతీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా రూ.20 లక్షల ఖరీదు చేసే ఇన్‌ప్లాంట్లు అందించారు. ఇటీవల ఆఫ్రికా ఖండంలోని అంగోల దేశంలో అక్కడి దేశ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ సీల్వియా పాలలుటుకుట ఆహ్వానం మేరకు వారం రోజులు పర్యటించి అక్కడి వైద్యులకు రివిజన్ రీప్లేస్‌మెంట్ సర్జరీల్లో శిక్షణ అందించారు. బంగ్లాదేశ్‌తో కూడా ఒప్పందం చేసుకుని వైద్యులకు జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీల్లో శిక్షణ అందిస్తున్నారు. రోబోటిక్ సర్జరీలను గుంటూరు ప్రజలకు చేరువ చేసి ఆధునిక వైద్య సేవలను మెట్రోపాలిటన్ నగరాలకు వెళ్లే పనిలేకుండా గుంటూరులోనే అందిస్తున్నారు.

పుట్టిన గడ్డ రుణం తీర్చుకోవాలనే...



డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి మైసూర్‌లో 1994లో ఎంబీబీఎస్, దావనగిరిలో 2003లో ఆర్థోపెడిక్ సర్జరీలో పీజీ పూర్తి చేశారు. హైదరాబాద్ సన్‌షైన్ హాస్పిటల్‌లో 2003–05 వరకు డాక్టర్ గురవారెడ్డి వద్ద తదుపరి ఇంగ్లాండ్‌లో 2005లో జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీ ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. పుట్టి పెరిగిన జిల్లా నుంచి ప్రతిరోజూ అధిక సంఖ్యలో వ్యయప్రయాసలతో మోకీలు మార్పిడి ఆపరేషన్ల కోసం వస్తున్న విషయాన్ని గమనించారు. దీంతో గుంటూరులో సాయిభాస్కర్ హాస్పిటల్ ఏర్పాటు చేశారు. హాస్పిటల్ ఏర్పాటు చేసిన మొదట్లో ప్రజలకు జాయింట్ రీప్లేస్‌మెంట్ ఆపరేషన్లు అంటే చాలా భయంతో పాటుగా పలు అనుమానాలు ఉండేవి. వాటిని తొలగించేందుకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

డాక్టర్ నరేంద్రరెడ్డి సేవలు అభినందనీయం



మోకీలు నొప్పులు, కీళ్ల అరుగుదల లాంటి సమస్యలతో జీజీహెచ్‌కు వచ్చే పేద ప్రజలకు డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి ఉచితంగా ఆపరేషన్లు చేయటం అభినందనీయం. ఆపరేషన్లు ఉచితంగా చేయటంతో పాటుగా సుమారు రూ.20 లక్షల ఖరీదు చేసే ఇంప్లాంట్‌లను ఆయనే తన ట్రస్ట్ ద్వారా పేదలకు ఉచితంగా ఇచ్చారు. ప్రభుత్వం మోకీలు మార్పిడి ఆపరేషన్లు తిరిగి ప్రారంభించేందుకు సిద్ధం అయ్యాం. త్వరలోనే ఉచిత ఆపరేషన్లు ప్రారంభమవుతాయి.

– డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్

మత్తు పదార్థాలతో జీవితం నాశనం



అవగాహన కల్పిస్తున్న రమేష్ తదితరులు

పెదకాకాని: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నీ తోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కో–ఆర్డినేటర్ రమేష్ అన్నారు. వెనిగండ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నవ జీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్, జాకబ్ రాజు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన బాలలను, యువతను డీ–ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకొనిరావచ్చన్నారు. 'నవ జీవన్ బాల భవన్ సంస్థ నూజివీడులోని బోస్కో డీ–ఎడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసిందన్నారు. ఉచిత చికిత్సకు 94904 92020 సంప్రదించవచ్చన్నారు. నవ జీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్ బాబు మాట్లాడుతూ మత్తుతో పడిన విద్యార్థుల జీవితం శూన్యంగా మారుతుందని, వాటి జోలికి వెళ్ల వద్దని సూచించారు. విద్యార్థులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, వారిని సన్మార్గంలో నడిపించాలన్నారు. మత్తు పదార్థాల దుర్వినియోగంపై స్క్రీన్ ప్రాజెక్టర్ ద్వారా వివరించారు. అనంతరం విద్యార్థులతో మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.తిరుపతిరావు, ఉపాధ్యాయులు ఎస్.జోసెఫ్, కోటేశ్వరావు, ఇంద్రావతి, పంచాయతీ సెక్రటరీ టి.బాలచంద్ర, మహిళా పోలీసులు లీల త్రిపుర, బి.కావ్యశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న సైకాలజిస్ట్ ప్రత్యూష సుబ్బారావు

చేబ్రోలు: విద్యార్థులు నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలని ప్రముఖ సైకాలజిస్ట్ ప్రత్యూష సుబ్బారావు అన్నారు. మండలంలోని నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం యువజన సర్వీసుల శాఖ – స్టెప్ – స్వశక్తి ఆధ్వర్యంలో విద్యార్థులు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు జరిగింది. యువజన సర్వీసుల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ మార్గదర్శకాలపై జరిగిన సమావేశానికి హెచ్ఎం ఎం.ఏడుకొండలు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సైకాలజిస్ట్ సుబ్బారావు కెరీర్ మార్గదర్శకాలు, నాయకత్వ లక్షణాలకను విపులంగా వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. స్టెప్ మేనేజర్ బి.రాధిక, సిబ్బంది పాల్గొన్నారు.

గులాబి రంగు పురుగుపై అప్రమత్తత తప్పనిసరి

డాట్ శాస్త్రవేత్తలు వెంకటలక్ష్మి, వెంకటరాములు



పత్తి పంటలో లింగాకర్షక బుట్టల ఏర్పాటు

ప్రత్తిపాడు: గులాబి రంగు పురుగు పట్ల పత్తి రైతులు అప్రమత్తంగా ఉండాలని డాట్ శాస్త్రవేత్తలు వెంకటలక్ష్మి, వెంకటరాములు అన్నారు. మండల పరిధిలోని కోయవారిపాలెంలో రైతులు సాగు చేసిన పత్తి పంట పొలాలను మంగళవారం సాయంత్రం ఏరువాక కో–ఆర్డినేటర్ ఎం.నగేష్‌తో కలిసి వారు పరిశీలించారు. పత్తి పంటలో పచ్చదోమ, నల్లి పురుగు ఉండటాన్ని గమనించారు. గులాబి రంగు పురుగు ఉధృతిని గమనించేందుకు పొలంలో లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏవో అరుణకుమారి, రైతులు ఉన్నారు.

జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స

సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్యుల ఘనత



ఆపరేషన్ చేయించుకున్న ఆంధ్రయ్యతో వైద్యులు

గుంటూరు మెడికల్: కామెర్లు, వొళ్లంతా దురద, పసుపు పచ్చని మూత్రం, తెల్లగా మలవిసర్జన వ్యాధితో బాధపడుతున్న రోగికి గుంటూరు జీజీహెచ్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు రూ.పది లక్షల విలువైన ఆపరేషన్ ఉచితంగా ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా చేశారని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. మంగళవారం శుశ్రుత హాలులో సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజి విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కోటి వెంకటేశ్వరరావుతో కలసి వివరాలను వెల్లడించారు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం అమ్మపాలేనికి చెందిన కేతవరపు ఆంధ్రయ్య కామెర్ల వ్యాధితో ఈ నెల 6న జీజీహెచ్‌కు వచ్చారు. వ్యవసాయ కూలిపనులు చేసుకునే ఆంధ్రయ్యకు వివిధ పరీక్షలు చేసి, పాంక్రియాటిక్ క్యాన్సర్ వ్యాధిగా వైద్యులు గుర్తించారు. ఈ ఆపరేషన్ ఎంతో కష్టమైనది డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఆపరేషన్‌లో భాగంగా పేగులను ఐదు చోట్ల జత చేయాలని, ఏమాత్రం ఒక పేగు అతుక్కుకోక పోయిన పేషంట్ ప్రాణాలకే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. అలాంటి క్లిష్టమైన ఆపరేషన్ ఏడు గంటల పాటు చేసి ఎక్కడ ఇబ్బందులు లేకుండా పేగులను జత చేసుకుంటూ విజయవంతం చేశారన్నారు. ఈ ఆపరేషన్ చేయాలంటే ప్రైవేట్ ఆస్పత్రిలో రూ.పది లక్షలకు పైగా ఖర్చు అవుతుందని ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేశారన్నారు. ఆపరేషన్ చేసిన డాక్టర్ కోటి వెంకటేశ్వరరావు, మత్తు వైద్యులు పోలయ్యను డాక్టర్ కిరణ్‌కుమార్ అభినందించారు.

రోడ్డు ప్రమాదం కేసులో నిందితుడి అరెస్ట్

మంగళగిరి: 2018లో మంగళగిరిలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో నిందితుడిని మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు.. కడపకు చెందిన బ్రహ్మయ్య రోడ్డు ప్రమాదం కేసులో నిందితుడుగా ఉన్నాడు. కేసు కోర్టులో నడుస్తుండగా కోర్టుకు హాజరుకాకుండా పరారీలో ఉన్నాడు. కోర్టు నాన్ బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేయగా మంగళవారం కడపలో ఉన్న నిందితుడు బ్రహ్మయ్యను అదుపులోకి తీసుకున్న కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించింది.

జాతీయ పోటీలకు పవర్ లిఫ్టర్ల ఎంపిక

మంగళగిరి: కోల్‌కతాలో మంగళవారం నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న సీనియర్ నేషనల్ మెన్ ఉమెన్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు గుంటూరు జిల్లా నుంచి ముగ్గురు పవర్‌లిఫ్టర్లు ఎంపికయినట్లు అసోసియేషన్ ప్రతినిధులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సంధాని మంగళవారం తెలిపారు. పట్టణంలోని కార్యాలయంలో 57 కేజీల విభాగంలో షేక్ సాదియా ఆల్మాస్, 84 కేజీల విభాగంలో బొల్లినేని చంద్రిక, షేక్ షబ్జీనా ఎంపికయినట్లు తెలిపారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి

మంగళగిరి: బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. పట్టణంలోని రత్నాల చెరువు ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం గుడ్ షెఫర్డ్ కాన్వెంట్, బాల భవన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రతినిధులు నాగమణి, ఇశ్రాయిల్, బి.విజయలక్ష్మి పాల్గొన్నారు.